సాక్షి
నాగర్‌కర్నూల్
శుక్రవారం : 18 : ఏప్రిల్ : 2025



**..మినహాయించి**
ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో శిథిలాల తొలగింపు ముమ్మరంగా కొనసాగుతోంది.
వివరాలు 10లో ▸



**'ఆరోపణలు తట్టుకోలేకపోయా'**
సోనియాగాంధీపై చార్జిషీటు వేయడాన్ని తట్టుకోలేకపోయానని చిన్నారెడ్డి అన్నారు.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
40.0 /21.6
**వాతావరణం**
ఉదయం, సాయంత్రం ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### కేజీబీవీ టీచర్ సస్పెన్షన్

**కందనూలు:** జిల్లాలోని నాగనూల్ కేజీబీవీలో పనిచేసే ఇంగ్లిష్ టీచర్‌ను విధుల నుంచి తొలగిస్తూ గురువారం సాయంత్రం డీఈఓ రమేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంగ్లిష్ టీచర్ వేధింపులు భరించలేక కేజీబీవీలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. దీనిపై విద్యార్థినులు ఆందోళనలు చేపట్టి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. దీంతో కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాల మేరకు ఇంగ్లిష్ టీచర్‌ను విధుల నుంచి తొలగిస్తూ.. సదరు ఉపాధ్యాయురాలిపై జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారన్నారు.

### 27న ప్రవేశ పరీక్ష

**కోడేరు:** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల)లో ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాఘవేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తెలంగాణ మోడల్ స్కూల్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. 6వ తరగతి విద్యార్థులు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

### అడవి జంతువులకు హాని కలిగించొద్దు



**నాగర్‌కర్నూల్ క్రైం:** అడవి జంతువులు గ్రామాలు, పొలాల్లోకి వస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని, జంతువులకు ఎలాంటి హాని తలపెట్టకూడదని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దేవరాజ్ అన్నారు. నాగర్‌కర్నూల్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో అటవీ జంతువుల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారాన్ని గురువారం ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ అటవీ జంతువుల వల్ల నష్టం జరిగితే సంబంధిత అటవీ శాఖ కార్యాలయాన్ని సంప్రదించి పరిహారం పొందవచ్చన్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో సమీప అటవీ ప్రాంతాల్లోని గ్రామాల్లోకి జంతువులు వస్తుంటాయని, వాటికి హాని కలిగించవద్దన్నారు. అనంతరం వెల్దండ మండలంలోని రవీందర్‌రెడ్డి, గంటల లక్ష్మయ్య, నర్సమ్మ, సైదమ్మ, ఊర్కొండ మండలానికి చెందిన ఆంజనేయులు, లక్ష్మయ్య, శ్రీనివాస్‌గౌడ్, పద్మ, వంగూరు మండలానికి చెందిన శ్రీనివాసులు, బిజినేపల్లి మండలానికి చెందిన ఉపేందర్‌రెడ్డి సహా మొత్తం పది మంది రైతులకు అటవీ జంతువుల కారణంగా పంటలు, పెంపుడు జంతువుల వల్ల కలిగిన నష్టానికిగాను రూ.3,12,000 పరిహారం అందజేసినట్లు వివరించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి చంటి, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉమ్మడి జిల్లాలో సీనియర్ సివిల్ జడ్జిల బదిలీలు

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** రాష్ట్రవ్యాప్తంగా గురువారం జరిగిన సీనియర్ సివిల్ జడ్జిల బదిలీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన పలువురు ఉన్నారు. వీరిలో నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జి.సబిత యాదాద్రి–భువనగిరి జిల్లాలోని రామన్నపేటకు బదిలీ అయ్యారు. దీంతో ఆ బాధ్యతలను కల్వకుర్తి జడ్జికి అప్పగించారు. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ కోర్టులో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న నసీం సుల్తానాను నాగర్‌కర్నూల్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శిగా పంపిస్తున్నారు. ఇక హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో అడిషనల్ జడ్జిగా పని చేస్తున్న వి.ఈశ్వరయ్యను మహబూబ్‌నగర్ జిల్లా కోర్టుకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. సికింద్రాబాద్‌లోని రాష్ట్ర జుడీషియల్ అకాడమిలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.వెంకట్‌రాంను నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టుకు సీనియర్ సివిల్ జడ్జిగా రానున్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న జి.కళార్చన వనపర్తి జిల్లా కోర్టుకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. ఇదే హోదాలో ఇక్కడ పనిచేస్తున్న కమలాపురం కవితను వనపర్తిలోని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా మార్చారు. జోగుళాంబ గద్వాల జిల్లా కోర్టులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న టి.లక్ష్మిని అక్కడే అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా మార్చారు. అలాగే ఇదే జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న గంటా కవితాదేవిని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కోర్టులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న గుండ్ల రాధికను ఇక్కడే అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా మార్చారు.

# డెడ్ స్టోరేజీ

## మే నెలాఖరుకు ఎడారిలా.. జూరాల



అడుగంటిపోయిన జూరాల జలాశయం

- అడుగంటిన జలాశయం.. ఆందోళనలో రైతన్నలు
- ప్రస్తుతం అందుబాటులో ఉన్నది 2.871 టీఎంసీలు మాత్రమే
- తాగునీటి కోసం ప్రతి రోజు 0.1 టీఎంసీలు వినియోగం
- ఇప్పటికే ఆయకట్టు పరిధిలోని పంటలకు సాగునీటి నిలిపివేత
- రాబోయే రోజుల్లో మరింత గడ్డు పరిస్థితులు

**తొమ్మిదేళ్లుగా మే మొదటి వారంలో జూరాలలో అందుబాటులో నీటినిల్వలు ఇలా...**

| ఏడాది | అందుబాటులో నీటినిల్వ |
|---|---|
| 2016 | 3.696 టీఎంసీలు |
| 2017 | 4.829 టీఎంసీలు |
| 2018 | 4.747 టీఎంసీలు |
| 2019 | 2.689టీఎంసీలు |
| 2020 | 7.627 టీఎంసీలు |
| 2021 | 6.477 టీఎంసీలు |
| 2022 | 7.836 టీఎంసీలు |
| 2023 | 4.038 టీఎంసీలు |
| 2024 | 4.004 టీఎంసీలు |
| 2025 (ఏప్రిల్17) | 2.953 టీఎంసీలు |

**గద్వాల:** ఉమ్మడి పాలమూరు జిల్లాకు పెద్దదిక్కుగా అయిన జూరాల జలాశయం గతంలో ఎన్నడూ లేనంతటి గడ్డు పరిస్థితులను ఎదుర్కోబోతోంది. వరుసగా రెండో ఏడాది కూడా జలాశయం అడుగంటిపోయింది. ఫలితంగా ఇప్పటికే సాగునీటి కష్టాలు తలెత్తగా.. రాబోయే రోజుల్లో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురుకానున్నాయి. అధికారులు ఇప్పటికే జూరాల ఎడమ, కుడి ప్రధాన కాల్వల కింద రబీలో సాగుచేసిన ఆయకట్టుకు నీటి విడుదల పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం జూరాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు ఈ నెలాఖరు నాటికే సరిపోతాయని, మే, జూన్ నెలల్లో తాగునీటికి కూడా ఇబ్బందులు తలెత్తవచ్చని రూపొందించిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ఈ నేపథ్యంలో రాబోయే రెండు నెలల్లో తాగునీటి గండాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జిల్లాకు రూ.కోటి చొప్పున రూ.5 కోట్లను ఆయా కలెక్టర్లకు విడుదల చేశారు.

**అధిక సాగు నేపథ్యంలో..**

జూరాల కింద.. జూరాల జలాశయం కింద ఎడమ, కుడి ప్రధాన కాల్వలు ఉండగా.. దీని ద మొత్తం ఆయకట్టు 1.09 లక్షల ఎకరాలు. కాగా ప్రతి ఏడాది ఖరీఫ్‌లో ఎడమ ప్రధాన కాల్వ పరిధిలో వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 72 వేల ఎకరాలు, కుడి ప్రధాన కాల్వ కింద జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలో 37 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది జూరాలలో నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని ఆయా కాల్వల కింద కేవలం 35 వేల ఎకరాలకు వారబందీ విధానంలో ఏప్రిల్ 15 వరకు సాగునీటిని అందిస్తామని అధికారులు ప్రకటించారు. కానీ, రైతులు అధికంగా సుమారు 50 వేల ఎకరాల్లో వరిపంట సాగుచేయడంతో సాగునీటి కష్టాలు మొదలయ్యాయి.

**మే నెలాఖరు నాటికే..**

ఇదిలా ఉండగా ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట, వనపర్తి, నాగరకర్నూల్ జిల్లాలు తాగునీటి అవసరాల కోసం జూరాల జలాశయం మీదనే ఆధారపడి ఉన్నాయి. ఇందుకోసం ప్రస్తుతం రోజుకు 0.1 టీఎంసీల నీటిని వదులుతున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన జలాశయంలో ఉన్న 0.208 టీఎంసీల నీరు మే నెలాఖరు నాటికే సరిపోతాయని అధికారులు అంచనా వేశారు.

**ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి**

ఈ ఏడాది నెలకొన్న నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి కోసం ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గ్రామాల్లో అందుబాటులో ఉన్న నీటి వనరుల పునరుద్ధరణపై స్పెషల్ డ్రైవ్ చేపట్టనుంది. ఇందులో భాగంగా చేతిపంపులు, మోటార్లు, బావులు, పంపుసెట్లు, బోర్లు, బోర్ల ఫ్లషింగ్ వంటి వాటిని గుర్తించి యుద్ధప్రాతిపదికన అవసరమైన మరమ్మతు చేపట్టాలని సూచించింది. ఇందుకోసం ప్రభుత్వం ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల కలెక్టర్లకు ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున రూ.5 కోట్లు మంజూరీ చేసింది. వీటిని తాగునీటి ప్రాధాన్యత కింద వినియోగించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.



జూరాల జలాశయంలో నీటినిల్వ

### ఎండలు ఎక్కువైతే ఇబ్బందులు..

ప్రస్తుతం జూరాలలో ఉన్ననీటి నిల్వలను పూర్తిగా తాగునీటి అవసరాలకే వినియోగిస్తాం. ఇప్పుడు జలాశయంలో అందుబాటులో ఉన్న నీరు మే నెలాఖరు వరకు సరిపోతాయి. అయితే ఎండలు ఎక్కువైతే ఇబ్బందులు రావొచ్చు. అప్పుడు పరిస్థితులను బట్టి అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం.

– రహీముద్దీన్ ఎస్‌ఈ జూరాల

### మరో తడి ఇవ్వండి..



అమరచింత ఎత్తిపోతల ద్వారా రబీలో 6 ఎకరాల్లో వరి పంట సాగు చేశా. ప్రస్తుతం జూరాల ఎడమ కాల్వ ద్వారా సాగునీటిని నిలిపేస్తున్నామని అధికారులు చెప్పారు. ఈ కాల్వకు అనుసంధానంగానే అమరచింత లిఫ్టుకు సాగునీరు అందుతుంది. మరో తడి సాగు నీరు ఇస్తేనే మా పంటలు చేతికి వస్తాయి.

– వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, అమరచింత

### రైతులను ఆదుకోవాలి..



జూరాల ప్రధాన ఎడమ కాల్వ పరిధిలోని డీ–6లో పంటలు సాగు చేస్తున్న రైతులకు ఇంకా పక్షం రోజుల పాటు నీళ్లు ఇస్తేనే పంట చేతికి వస్తుంది. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులకు ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నాం. మా పంటలు చేతికి వచ్చే విధంగా సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలి.

– లక్ష్మణ్, రైతు, ఆరేపల్లి, ఆత్మకూర్ మండలం

### అన్నదాతల ఆందోళన..

వారబందీ విధానంలో ఈ నెల 15 వరకు సాగునీరు అందిస్తామని ప్రకటించిన అధికారులు జూరాలలో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటిపోవడంతో ఈ నెల 10 వరకే సాగునీటిని నిలిపివేశారు. దీంతో తమ పంటలు చివరి దశలో ఉన్నాయని, ఇంకో రెండు తడులు వదలాలని రైతులు రోడ్డెక్కి ధర్నా చేశారు. ఎడమ కాల్వ పరిధిలో రైతులు పదిరోజుల వ్యవధిలోనే రెండుసార్లు ఆందోళన చేపట్టారు.



జూరాల డ్యాంపై ధర్నా చేస్తున్న ఎడమ ప్రధాన కాల్వ పరిధిలోని రైతులు

## 'భూ భారతి'తో భూ సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న రైతు కమిషన్ సభ్యుడు కేవీ నర్సింహారెడ్డి, పక్కన కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు

**వంగూర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంతో భూ సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం వంగూరు రైతువేదికలో నిర్వహించిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'భూ భారతి' నూతన ఆర్‌ఓఆర్ చట్టం భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రికార్డులలోని తప్పొప్పులను క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది ద్వారా సవరించుకునే అవకాశం ఉందన్నారు. ఈ చట్టంపై నిర్వహించే అవగాహన సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూన్ 2 నుంచి ఆన్‌లైన్‌లో భూభారతి చట్టం పోర్టల్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు మీసేవలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఒకవేళ సమస్య పరిష్కరించకపోతే చలాన్ ద్వారా చెల్లించిన మొత్తాన్ని తిరిగి బాధితులకు ఇస్తారన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న భూ భారతి చట్టంలోని నిబంధనల ప్రకారం రికార్డులను అప్‌డేట్ చేస్తారన్నారు. 'భూ భారతి' నూతన ఆర్‌ఓఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరిచి నూతన చట్టాన్ని తెచ్చిందన్నారు. రైతు కమిషన్ సభ్యుడు కేవీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగం ధరణి ద్వారా తమ భూ రికార్డులలో ఎదుర్కొన్న అనేక సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక భూ రికార్డుల చట్టం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మురళీమోహన్ పాల్గొన్నారు.

### తాగునీటి సరఫరాకు ముందస్తు చర్యలు

**నాగర్‌కర్నూల్:** వేసవి నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వేసవిలో తాగునీటి సరఫరా తదితర అంశాలపై అదనపు కలెక్టర్ దేవసహాయం, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరాపై మున్సిపల్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరతగతిన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశిత గడువులోగా నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ చూపాలని, నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఓ చిన్న ఓబులేషు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ గోపాల్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ కళాశాలలో జాతీయ సదస్సు

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రబంధ వాజ్మ యం సాహిత్యం శీలనములనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నేటి కాలంలో కవులు అంతరించి పోతున్నారని, ఇలాంటి తరుణంలో కళాశాలలో ప్రబంధ వాజ్మయం పేరుతో సెమినార్ నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఈ ప్రబంధ వాజ్మయం హాస్యం, చతురత, వర్ణన, శృంగారం, కథ అనే అంశాల ఆధారంగా ఆనాటి జీవన స్థితిగతులను, ఆర్థిక, సామాజిక పరిస్థితులను వివరిస్తుందన్నారు. ఈ సందర్భంగా సెమినార్ సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీయూ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీయూ కంట్రోలర్ రాజ్‌కుమార్, లక్ష్మీనరసింహారావు, కేశవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలోనే రోల్ మోడల్‌గా భూభారతి



మద్దూర్ మండలం ఖాజీపూర్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- ఒక్క రూపాయి తీసుకోకుండానే భూ సమస్యలు పరిష్కరిస్తాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- మద్దూరు మండలం ఖాజీపూర్‌లో రెవెన్యూ సదస్సు ప్రారంభం

**నారాయణపేట/మద్దూర్/కొత్తపల్లి:** పేదలకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని.. ఒక్క రూపాయి తీసుకోకుండానే భూ సమస్యలను పరిష్కరించనున్నామని.. దేశంలోనే భూ భారతి చట్టం రోల్‌మోడల్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికై న మద్దూరు మండలం ఖాజీపూర్ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై పోర్టల్‌ను ప్రారంభించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి గ్రామస్తులు, రైతులు పెద్ద ఎత్తున మంత్రికి స్వాగతం పలకగా.. కాలినడకన రెవెన్యూ సదస్సు సభా స్థలికి చేరుకుని మాట్లాడారు. ప్రతి రైతుకు భరోసా, భద్రత కల్పించాలని ఉద్దేశంతో మేధావులతో కలిసి ఈ చట్టాన్ని రూపొందించామని, గత ప్రభుత్వ ధరణి చట్టానికి దీనికి ఎంతో తేడా ఉందన్నారు.

**ప్రజల వద్దకే అధికారులు..**

ధరణి చట్టంతో ప్రజలు అధికారుల వద్దకు వెళ్లాల్సి ఉండేదని, భూభారతితో ప్రజల వద్దకే అధికారులు వచ్చి భూ సమస్యలను పరిష్కరిస్తారన్నారు. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను, వీఆర్‌ఏ వీఆర్వో వ్యవస్థను కుప్ప కూల్చిందని, ఈ ప్రజా ప్రభుత్వంలో గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించి, అర్హులైన వారిని మళ్లీ తీసుకువచ్చి గ్రామాల్లో ఇలాంటి భూ సమస్య ఎక్కడ ఉన్నా అక్కడే పరిష్కారం చూపిస్తామన్నారు. ఎవరి పేరుతో ఎంత భూమి ఉందో అది వారికే చెందేలా చూస్తామన్నారు. మొదటి విడత 6 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చి మ్యాప్‌పై సర్వేయర్ సంతకంతో కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుందన్నారు. సీఎం ఇటీవల కలెక్టర్లను పిలిచి భూ భారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని స్పష్టంగా చెప్పారన్నారు. అన్ని మండలాలకు కలెక్టర్లు వెళ్లి ఈ చట్టంపై ప్రజలు, రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. అయితే జూన్ 2 లోగా ఎంపిక చేసిన మొదటి నాలుగు పైలెట్ గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ఆ తర్వాత ప్రతి మండలం, ప్రతి రెవెన్యూ గ్రామానికి ఇదే పద్ధతిలో అధికారులే రైతుల వద్దకు వస్తారన్నారు. సీఎం నాయకత్వంలో ఇందిరమ్మ రాజ్యం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. తాము అమలు చేస్తున్న కొత్త భూభారతి చట్టాన్ని ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు వినియోగించుకోవచ్చని మంత్రి సూచించారు. ధరణితో ప్రజలను ఎంత గోస పెట్టారో భూ భారతి అమలులోకి వచ్చిన తర్వాత తెలుస్తుందన్నారు. ప్రభుత్వం ఏదైనా మంచి పని చేస్తే మంచి చేసిందని చెప్పకపోయినా పర్వాలేదు కానీ.. మంచిని చెడుగా చెప్పి ప్రచారం చేస్తే మాత్రం ప్రతిపక్షానికి వచ్చే ఎన్నికలలో రెండు అంకెల సీట్లు కూడా రావని, పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల మాదిరిగా శాసనసభ ఎన్నికలలో రిపీట్ అవుతుందని జోస్యం చెప్పారు.

### నూతన అధ్యాయానికి శ్రీకారం

రాష్ట్ర ప్రభుత్వం భూ పరిపాలనలో నూతన అధ్యాయానికి శ్రీకారం చూడుతూ భూ భారతి పోర్టల్‌ను ఈ నెల 14న ప్రారంభించిందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లాలోని మద్దూరు మండలాన్ని పైలెట్ మండలంగా ఎంపిక చేసిందని, భూ పరిపాలనలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పోర్టల్‌ను జిల్లా అధికార యంత్రాంగం, ఉద్యోగుల సహకారంతో విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, చిట్టెం పర్ణికారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎనుముల తిరుపతి రెడ్డి, భూభారతి ప్రత్యేక అధికారి యాదగిరి, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, మంద మకరంద్, ఎస్పీ యోగేష్ గౌతమ్, అడిషనల్ కలెక్టర్ బేన్‌షాలం, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన ఎస్‌ఏ–2 పరీక్షలు

- 23న ముగియనున్న 2023- 24 విద్యా సంవత్సరం



లక్నారం ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

**కందనూలు:** జిల్లాలో 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ–2) పరీక్షలు గురువారం ముగిశాయి. వీరి ప్రతిభను తెలిపే ప్రోగ్రెస్ కార్డుల విధానానికి స్వస్తి పలికి రెండేళ్లుగా విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రగతి పత్రాలను అందజేస్తున్నారు. ఇందుకు సంబంధించి విద్యాశాఖ వద్ద ఇప్పటికే నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక (ఎస్‌ఏ–1) పరీక్ష ఫలితాలు సిద్ధంగా ఉన్నాయి. ఈ నెల 20లోగా ఎస్‌ఏ–2 పరీక్షల ఫలితాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలలో ఇది వరకు విద్యార్థులకు నిర్వహించిన నిర్మాణాత్మక (ఎఫ్‌ఏ–1, 2, 3, 4), సంగ్రహణాత్మక (ఎస్‌ఏ–1) మూల్యాంకనానికి సంబంధించిన ఫలితాల అప్‌లోడ్ ప్రక్రియ పూర్తయింది. సమ్మేటివ్–2 పరీక్షలు గురువారంతో పూర్తి కావడంతో ఉపాధ్యాయులు జవాబు పత్రాలు మూల్యాంకనం చేస్తున్నారు. ఫలితాలను ఆదివారంలోగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. సోమవారం ఆన్‌లైన్‌లో కార్డులు డౌన్‌లోడ్ చేసుకుని, బుధవారం తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి వారి సమక్షంలో ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులు విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ తర్వాత ఈ నెల 24 నుంచి వేసవి సెలవులు ప్రకటిస్తారు.

### ప్రతి విద్యార్థికి అందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రగతి పత్రాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక పరీక్షలకు సంబంధించిన ఫలితాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని హెచ్‌ఎంలకు సూచించాం. ఈ నెల 23న తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రతి విద్యార్థికి ప్రోగ్రెస్ కార్డులు అందించాలి.

– రాజశేఖర్‌రావు, జిల్లా పరీక్షల నిర్వహణాధికారి

## అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారి కృష్ణమూర్తి

**నాగర్‌కర్నూల్ క్రైం:** షాపింగ్‌మాల్స్, ఆస్పత్రులు, సినిమా థియేటర్లతోపాటు పెద్ద భవనాలకు అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కృష్ణమూర్తి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాకేంద్రంలోని ఓ షాపింగ్‌మాల్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే అదుపు చేసేందుకు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో లీడ్ ఫైర్‌మెన్లు రంగస్వామి, వహీద్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### హార్వెస్టర్ మరమ్మతు చేస్తూ.. యువకుడు మృతి


కావలి వెంకటేశ్ (ఫైల్)

ఆత్మకూర్: వరి కోత యంత్రం మరమ్మతు చేస్తూ ప్రమాదవశాత్తు ఓ యువకుడు మృతిచెందిన ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేందర్ కథనం మేరకు.. పట్టణంలోని భార్గవినగర్‌కు చెందిన కావలి వెంకటేష్ (30) సొంతంగా వరి కోత యంత్రం నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం మధ్యాహ్నం మేడేపల్లి శివారులో వరికోత యంత్రం మరమ్మతుకు గురికావడంతో డ్రైవర్ మన్యంతో కలిసి బాగు చేస్తుండగా కట్టర్ బార్ మీద పడటంతో వెంకటేష్ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి ..

పాన్‌గల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 13వ తేదీన పాన్‌గల్ మండలంలోని అన్నారంతండా సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వనపర్తి మండలం నాగవరం గ్రామానికి చెందిన దేవేందర్(47)కు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### బాలికపై వేధింపులు.. యువకుడిపై కేసు నమోదు

మిడ్జిల్: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని బోయిన్‌పల్లిలో మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన రాఘవేందర్ వేధిస్తున్నాడని, అమ్మాయి తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు యువకుడిపై గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

### దొంగకు మూడేళ్ల జైలుశిక్ష

ఖిల్లాఘనపురం: దొంగతనానికి పాల్పడిన ఓ వ్యక్తికి న్యాయమూర్తి మూడేళ్ల కఠిన జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. వివరాలు.. ఖిల్లాఘనపురం మండలంలోని బజారు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న బంగారు వర్క్‌షాపులో 2024 డిసెంబర్ 24న 14 గ్రాముల బంగారు ఆభరణాలు, 615 గ్రాముల వెండి వస్తువులు కలిపి మొత్తం రూ.40,300 విలువ చేసే వస్తువులు దొంగిలించబడ్డాయి. ఈ విషయమై షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన పంతంగాణి మన్యంకొండ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు డిసెంబర్ 29 కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఆదేశంతో రిమాండ్ తరలించారు. ఎస్ఐ సురేష్‌గౌడ్ చోరీకి సంబంధించిన పూర్తి వివరాలు కోర్టుకు సమర్పించడంతో వనపర్తి జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు రెండో అదనపు న్యాయమూర్తి నిందితుడికి మూడేళ్ల కఠిన జైలు శిక్ష ఖరారు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో రాష్ట్ర అభియోగ అధికారి వై.రాజేష్, కోర్టు డ్యూటీ అధికారి టి.శ్రీనివాసులు సహకారం అందించారని పేర్కొన్నారు.

# ప్రమాదకర ప్రదేశం మినహాయించి..


సొరంగం లోపల మట్టి తవ్వకాలు చేపడుతున్న ఎస్కవేటర్లు

- మరో రెండ్రోజుల్లో తవ్వకాలు పూర్తయ్యే అవకాశం
- నిషేధిత ప్రదేశంలో రెస్క్యూ కొనసాగేనా?

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో శిథిలాల తొలగింపు వేగంగా కొనసాగుతోంది. సహాయక బృందాలు 55 రోజులుగా నిరంతరాయంగా తవ్వకాలు చేపడుతున్నా ఆరుగురి ఆచూకీ లభ్యం కావడం లేదు. గురువారం మూడు షిఫ్టులలో సొరంగంలోకి వెళ్లి పేరుకుపోయిన మట్టి, బురద తవ్వకాలు చేపడుతున్నారు. డీ2 ప్రదేశంలో 5 ఎస్కవేటర్లతో పెద్ద పెద్ద బండరాళ్లు తొలగిస్తూ అత్యధికంగా ఉన్న మట్టిని కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తరలిస్తున్నారు. నిషేధిత ప్రదేశం 50 మీటర్లు మినహాయిస్తే.. డీ2–డీ1 మధ్య మరో 20 మీటర్ల పొడవు మూడు అడుగుల మేర ఉన్న మట్టి, బురద, శిథిలాల తొలగింపు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. మరో రెండ్రోజుల్లో ఈ పని పూర్తయ్యే అవకాశం ఉందని సహాయక సిబ్బంది చెబుతున్నారు. సొరంగం పైకప్పు కూలిన 13.940 కిలోమీటరు డీ1 ప్రదేశంలో 40 మీటర్ల వరకు డేంజర్ జోన్‌గా గుర్తించి కంచె ఏర్పాటు చేశారు. ఈ ప్రదేశంలో బలహీనంగా ఉన్న కాంక్రీట్ సెగ్మెంట్లకు సపోర్టుగా సింగరేణి మైన్స్ రెస్క్యూ సిబ్బంది టైగర్ క్లాక్స్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ శిథిలాలు నిండుగా ఉన్నాయి. అత్యంత ప్రమాదకర ప్రదేశం మినహాయించి తవ్వకాలు చేపడుతున్నాయి. ప్రస్తుతం చేపడుతున్న 20 మీటర్ల తవ్వకాల్లో కార్మికుల ఆచూకీ లభించకపోతే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. టీబీఎం కొంత భాగం నిషేధిత ప్రదేశంలో చిక్కుకుపోయి ఉండటంతో కార్మికులు అందులో ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, జీఎస్ఐ తదితర జాతీయ సహాయక బృందాలతో పాటు ప్రభుత్వ విభాగాలతో ఉన్నతస్థాయి సాంకేతిక కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నిషేధిత ప్రదేశంలో కార్మికులను గుర్తించే ప్రయత్నాలు కొనసాగించాలా? సహాయక సిబ్బందికి ఎలాంటి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమిటీ ఇచ్చే నివేదికపై ఆధారపడి ముందుకెళ్లే అవకాశం కనిపిస్తోంది.

### డీ-2 ప్రదేశంలో మట్టి తవ్వకాలు..

సొరంగంలోని ప్రమాద డీ2 ప్రదేశంలో సహాయ సిబ్బంది మట్టి తవ్వకాలు చేపడుతున్నారని ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం ఇన్‌లెట్ వద్ద గురువారం సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ కనుక్కొనేందుకు డీ1, డీ2 ప్రాంతాల్లో అన్వేషణ కొనసాగుతుందన్నారు. డీ2 ప్రదేశంలో మట్టి తవ్వకాలు చేపడుతూ టీబీఎం కత్తిరింపు పనులు చేపడుతున్నామని తెలిపారు. నిరంతరంగా వస్తున్న నీటి ఊటను బయటకు పంపిస్తున్నామని, ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని నిషేధిత ప్రదేశంగా గుర్తించి కంచె ఏర్పాటు చేశామన్నారు. సొరంగం నిపుణులు ప్రమాద ప్రదేశాన్ని నిరంతరం పరిశీలిస్తూ సహాయక సిబ్బందికి తగిన సూచనలు ఇస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజినీర్ సంజయ్‌కుమార్‌సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.


## మెనూ పాటించడం లేదని హాస్టల్ విద్యార్థుల నిరసన


హాస్టల్ ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులకు నచ్చజెపుతున్న హాస్టల్ వార్డెన్ ఖలీల్

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని మోడల్ డిగ్రీ కళాశాల హాస్టల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం అందించే కామన్ మెనూ పాటించడం లేదని విద్యార్థులు నిరసన తెలిపారు. గురువారం రాత్రి భోజన సమయంలో భోజనానికి ముందు మెనూ గురించి అడిగితే ఔట్‌సోర్సింగ్ కుక్ శ్రీశైలం పొంతలేని సమాధానాలు చెప్పారని ఆరోపించారు. భోజనాలు చేయకుండా హాస్టల్‌లో ఉండే విద్యార్థులు అంతా కలిసి పట్టణంలోని పాలమూరు రోడ్డుపైకి వెళ్లారు. వెంటనే అప్రమత్తమైన హాస్టల్ వార్డెన్ ఖలీల్ విద్యార్థులకు నచ్చజెప్పి హాస్టల్‌కు తీసుకొచ్చారు. హాస్టల్ లోపలికి వచ్చిన విద్యార్థులు భోజనం చేయమని వారించి రాత్రి 10 గంటల దాకా హాస్టల్ ఎదుట కూర్చొని నిరసన తెలిపారు. చివరికి హాస్టల్ వార్డెన్ వారికి నచ్చజెప్పి, కుక్‌ను తొలగిస్తామని, మెనూ ప్రకారం భోజనం ఉండేలా చూసేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి అందేలా చూస్తానని చెప్పడంతో విద్యార్థులు నిరసన విరమించి.. భోజనాలు చేశారు.

### దేవరగుట్టలో సీసీ కెమెరాల నిఘా

- బోన్ల ఏర్పాటుపై త్వరలో నిర్ణయం


చిరుతలు నివాసం ఉంటున్న దేవరగుట్ట

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల దేవరగుట్టపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఫారెస్టు అధికారి చంద్రయ్య తెలిపారు. గురువారం ఆయన సిబ్బందితో కలిసి చిరుతలు నివాసం ఉంటున్న గుట్టను పరిశీలించారు. తమకు, పశువులకు ప్రాణహాని ఉందని చిరుతల నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరారు. గ్రామానికి దగ్గరగా ఉన్న గుట్టలో చిరుతలు ఉండటంతో నిత్యం భయంతో జీవిస్తున్నామని రక్షణ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారి మాట్లాడుతూ.. దేవరగుట్టలో చిరుతలు ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయని, పరిసరాల్లోకి వెళ్లరాదని సూచించారు. చిరుతల కదలికలు గుర్తించేందుకు ముందుగా గుట్ట ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల్లో వాటి కదలికల ఆధారంగా బోనుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటామని వివరించారు.

## ఐతోల్‌లో భవన నిర్మాణ కార్మికుడి మృతి


ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న బాధిత కుటుంబసభ్యులు

న్యాయం చేయాలని జిల్లాకేంద్రంలో ధర్నా

నాగర్‌కర్నూల్ క్రైం: భవన నిర్మాణ పనులకు వచ్చిన కార్మికుడు మృతి చెందిన సంఘటన తాడూరు మండల పరిధిలోని ఐతోలులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్ల గ్రామానికి చెందిన సంపంగి రాములు (32) ఐతోల్‌లో నిర్మాణమవుతున్న ప్రైవేటు పాఠశాల భవనంలో కూలీ పనికోసం వెళ్లాడు. అస్వస్థతకు గురై కింద పడిపోయి మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. భవన యజమాని లక్ష్మారెడ్డి గురువారం రాత్రి వరకు పట్టించుకోకపోవడంతో ఆగ్రహంతో కుటుంబసభ్యులు జిల్లాకేంద్రంలోని ప్రధానరహదారిపై ధర్నాకు దిగారు. యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో.. అక్కడికి చేరుకున్న పోలీసులు అక్కడి వారిని సముదాయించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

## 'సోనియాగాంధీపై ఆరోపణలు తట్టుకోలేకపోయా'


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి

వనపర్తి టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాహుల్‌గాంధీ బ్రాండ్ ఇమేజ్ రాజకీయాలకు భయపడుతూ అక్రమ కేసులతో భయపెట్టాలని చూస్తోందని, మోదీ గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ చార్జిషీట్ వేయడాన్ని నిరసిస్తూ గురువారం వనపర్తి ప్రధాన పోస్టల్ కార్యాలయం ఎదుట డీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో చిన్నారెడ్డి పాల్గొని మాట్లాడారు. విలువలు, నిజాయితీ కలిగిన రాజకీయాలకు సోనియాగాంధీ పెట్టింది పేరని, ఆమెపై చార్జీషీటు వేయడాన్ని తట్టుకోలేకపోయానని చిన్నారెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. సోనియాగాంధీని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ గుర్తించుకుంటారన్నారు. నేషనల్ హెరాల్డ్‌ను రుజువులు లేకుండా లాగుతున్నారని, పుష్కరకాలం నాటి హెరాల్డ్ కేసులో ఒక్క పైసా కూడా మార్పిడి జరగలేదని చెప్పారు. న్యాయస్థానంలో ఈడీకి, కేడీకి భంగపాటు తప్పదని జోస్యం చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వేణు, సింగిల్ విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలంతా సంఘటితం కావాలి


మాట్లాడుతున్న అజయ్‌కుమార్ యాదవ్

నవాబుపేట: బీసీలంతా సంఘటితమై దోపిడీ వర్గాల రాజ్యాలను కూలదోసి నియంత పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని బీసీ జనచైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయ ఆవరణలో బీసీ జనచైతన్య సదస్సు వేదిక జిల్లా నాయకుడు మాధవులు అధ్యక్షతన జరగగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా నేటికీ దోపిడీ రాజ్యం నడుస్తోందన్నారు. ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న కాంగ్రెస్‌కు తాజాగా బీసీల గణన గుర్తుకురావటం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ అది నాయకత్వానికి ధైర్యం ఉంటే రాష్ట్రంలో బీసీని ముఖ్యమంత్రి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్రంలోని బీజేపీ సైతం అధిక జనాభా కలిగిన బీసీలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. బీసీలంతా పార్టీలు వీడి సమష్టిగా ఉన్నప్పుడే బలం తెలిసి రాజ్యాధికారం వస్తుందని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ అధ్యక్షుడు బోయిని మహేష్, జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు యాదయ్య, ఆంజనేయులు, మాసయ్య, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్ నాయీ, జిల్లా నాయకులు అంజయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో 25 ఏళ్ల జైలుశిక్ష

నారాయణపేట రూరల్: బాలికకు మాయమాటలు చెప్పి వివాహం చేసుకున్న నిందితుడికి నారాయణపేట కోర్టులో 25 ఏళ్ల జైలుశిక్ష పడింది. ఎస్పీ యోగేష్ గౌతమ్ కథనం ప్రకారం.. మండలంలోని కొల్లంపల్లి గ్రామానికి చెందిన బాలిక పదో తరగతి చదువుతున్న సమయం నుంచి అదే గ్రామానికి చెందిన ఎం.బాలరాజు అనే యువకుడు ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. ఇంటర్ చదివే సమయంలో గతేడాది జనవరి 17న కాలేజీకి వెళ్లిన అమ్మాయికి మాయమాటలు చెప్పి భద్రాచలం తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. అనంతరం తిరుపతికి వెళ్లి అక్కడ నాలుగు రోజులు బస చేశారు. అమ్మాయి కనపడకపోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాలిక తండ్రి ఫిర్యాదు ఇచ్చిన విషయం తెలుసుకొని గతేడాది జూన్ 28న కొల్లంపల్లి గేటు మీద అమ్మాయిని వదిలేసి వెళ్లిపోయాడు. ఈ విషయమై ఏఎస్ఐ సంజీవయ్య కేసు నమోదు చేయగా డీఎస్పీ లింగయ్య సూచన మేరకు సీఐ శివశంకర్, ఎస్ఐలు జయప్రసాద్, కృష్ణదేవ విచారణ చేపట్టారు. ప్రస్తుత ఎస్ఐ రాయుడు సహకారంతో కోర్టు లైజెనింగ్ ఆఫీసర్ కృష్ణయ్యగౌడ్ సాక్షుల ఆధారంగా నేరాన్ని నిరూపించారు. దీంతో గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ నిందితుడికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.15 వేల జరిమానా, బాధితురాలికి రూ.5 లక్షల నష్టపరిహారం అందించాలని తీర్పునిచ్చారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.

## హత్య కేసులో వ్యక్తికి పదేళ్ల జైలుశిక్ష

నారాయణపేట: ఓ హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించిన వివరాలను నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ గురువారం ఒక ప్రకటనలో వివరించారు. మక్తల్ మండలంలోని పసుపుల గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడు నర్సింహులు తన అక్క నింగమ్మను అదే గ్రామానికి చెందిన లక్ష్మప్ప అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమార్తెలు రేణుక, శిరీష ఉన్నారు. పదేళ్ల క్రితం నింగమ్మ అనారోగ్య కారణాల వల్ల చనిపోయింది. ఆమె కుమార్తెలు రేణుకను ఆలూరు గ్రామానికి చెందిన గోపిమల్లేష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిపించి.. అల్లుడిని ఇల్లరికం తెచ్చుకున్నారు. మల్లేశ్ పొలం పనులు చేయడం లేదని మామ లక్ష్మప్ప తరచుగా మందలించేవాడు. 2023 జూలై 14వ తేదీన గోపి మల్లేష్, రేణుక, లక్ష్మప్పలు కూలీవాళ్లతో కలిసి పొలం పనులకు వెళ్లారు. పనిచేయకుండా అక్కడ చెట్టుకింద ఖాళీగా కూర్చున మల్లేష్‌ను.. ఆవులను గడ్డిమేతకు తీసుకెళ్లమని లక్ష్మప్ప చెప్పాడు. దీంతో ఆగ్రహించిన ఆయన పదేపదే పని చెప్పావా అంటూ.. నిన్ను చంపేస్తే నాకు ఎవరు ఎదురు చెప్పేవాళ్లే ఉండరని కట్టెతో లక్ష్మప్ప తలపై బలంగా కొట్టాడు. దీంతో ఆయన కింద పడిపోవడంతో.. అక్కడి వారు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. తన బావ లక్ష్మప్పను కొట్టి చంపినందుకు గోపి మల్లేష్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జూలై 15వ తేదీన నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ పర్వతాలు కేసు నమోదు చేసుకున్నారు. సీఐ రామ్‌లాల్ ఆధ్వర్యంలో విచారణ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప కోర్టులో వాదన వినిపించారు. గోపిమల్లేష్ నేరం చేసినట్లు రుజువు కావడంతో జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. ఈ కేసులో బాగా పనిచేసిన పోలీస్ అధికారులను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను అభినందిస్తూ వారికి త్వరలో రివార్డు ఇవ్వనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.



# అకాల వర్షాలు.. పంటలో జాగ్రత్తలు


వరి పొలాల నుంచి నీటిని తొలగించడం(ఫైల్)


వరి పైరును గట్లపై వేసిన దృశ్యం(ఫైల్)

పాడి-పంట

అధికారి సలహా: సక్రియానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, గద్వాల

అలంపూర్: అకాల వర్షాలతో పంటకు నష్టం జరిగే ప్రమాదం పొంచి ఉంది. ప్రధానంగా వివిధ దశలో ఉన్న మొక్కజొన్న, పత్తి, వరి, పసుపు వంటి పంటకు నష్టం జరగడానికి అవకాశాలు ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఈ దశలో పంటను కాపాడుకోవడానికి రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటను రక్షించుకోవడానికి జాగ్రత్తలు తీసుకుంటే కొంత వరకు రైతులకు మేలు జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. వివిధ పంటను కాపాడుకోవడానికి సూచనలు ఇలా..

**వరి**

- వరి పంట ప్రస్తుతం పొట్టు దశలో చివరి దశలో ఉంది. గింజ గట్టిపడి కోతకు సిద్ధంగా ఉంది.
- కోతకు సిద్ధంగా ఉన్నా..లేదా గింజ గట్టిపడి వెన్ను వంగి ఉన్న దశలో పైరు పడిపోతే పొలంలోకి చేరిన నీటిని తొలగించుకోవాలి.
- గింజకు శిలీంద్రాలు ఆశించకుండా గింజ నల్లబడకుండా ఉండటానికి ఒక లీటర్ నీటికి 2 మి.లీ. హెక్సా కొన జోల్ కలిపి పిచికారీ చేసుకోవాలి.
- ఖాళీగా ఉన్న పొలాల్లో ఈ తేమతో దుక్కి దున్నుకోవాలి.
- హైబ్రిడ్ వరిలో వర్షాల వలన సుంకు రాలిపోవడం జరుగుతుంది. ఈ మేరకు కొంత నష్టం జరుగుతుంది.
- వరి కోత దశలో ఉన్న సమయాల్లో తొందరపడి కోయకుండా వారం రోజుల పాటు ఆగి ఆ తర్వాత మొదలు పెట్టుకోవాలి.
- కోత కోసిన పైర్లను వాటిని పొలాల్లో కాకుండా పొలం గట్ల మీద వేసుకోవాలి. పొలాల్లోనే ఉంటే మొలకలు వచ్చే ప్రమాదం ఉంటుంది. గట్లపై వేసిన పైరుపై లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి చల్లాలి. ఇలా చేస్తే మొలక రాదు.
- వర్షాలు తగ్గిన తర్వాత పంటను నూర్పిడి చేసి ఎండలో బాగ ఆరబెట్టి నిల్వ చేసుకోవాలి.

**పత్తి**

- పత్తి సాగు చేసిన రైతులు ఎట్టి పరిస్థితుల్లో పంట పైరు కాలన్నీ పొడగించరాదు. తేమను ఆసరాగా చేసుకోని లోతు దుక్కిలు చేసుకోవాలి.

**మొక్కజొన్న**

- కోతకు వచ్చిన పంటను ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకోని కోత కోయరాదు.
- వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత కోతను ప్రారంభించుకోవడం మంచిది.
- కోసిన కంకులు తడిస్తే వెంటనే పొలం నుంచి బయటికి తెచ్చి ప్రత్యేక గాలి మరల ద్వారా 100 శాతం ఆరబెట్టాలి. ఇలా ఆరబెట్టకపోతే ధాన్యం రంగు మారుతుంది. బూజుపట్టే అవకాశం లేకపోలేదు. తినడానికి పనికిరాకుండా పోవడం, విక్రయానికి తీసుకెళ్లిన ఆశించిన మద్దతు ధర లభించకపోవడం జరుగుతుంది.
- గింజలు తడిస్తే నీడలో ఆరబెట్టి గాలి పంకాల ద్వార ఆరబెట్టుకోవాలి. వర్షాలు తగ్గిన తర్వాత ఎండలో ఆరబెట్టి నిల్వ చేసుకోవాలి.

**పసుపు**

- తడిసిన దుంపలను భూమి నుంచి వేరు చేసి టార్పాలిన్ బరకలతో కప్పుకోవాలి.
- దుంపలు తడవడం వలన ఎండిన తర్వాత రంగు మారుతాయి. మార్కెట్‌కు తీసుకెళ్లే మంచి ధర లభించే అవకాశం ఉండకపోవచ్చు.
- ఆశించిన ధర లభించాలంటే దుంపలను పాలిషింగ్ చేయాలి. దీని వలన నాణ్యత పెరిగి మంచి ధర లభిస్తోంది. అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి వారి సహాయ సహకరాలను తీసుకోవాలని సూచించారు.

### జనరల్ ఆస్పత్రి సిబ్బందిపై దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో వైద్య సిబ్బందిపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఆర్ఎంఓ డా.రవిశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జనరల్ ఆస్పత్రిలో గురువారం ఉదయం వైద్యం చేయించుకునేందుకు వచ్చిన ఓ వ్యక్తి కోసం ముక్కిడిగుండంకు చెందిన భాస్కర్‌తో పాటు మరికొంత మంది లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ గార్డ్ వారిని అడ్డుకున్నాడు. దీంతో గొడవ చోటుచేసుకోవడంతో అక్కడే ఉన్న నర్సింగ్ ఆఫీసర్ కిరణ్ వైద్యం జరుగుతుందని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో భాస్కర్ నర్సింగ్ ఆఫీసర్ కిరణ్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆర్ఎంఓ తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ఇద్దరికి రిమాండ్

మల్దకల్: మండలకేంద్రంలో ఇటీవల రామకృష్ణ అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడగా.. ఆ ఘటనకు సంబంధించి ట్రాన్స్‌జెండర్ శివానితో పాటుగా మరో వ్యక్తి రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నందికర్ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో ప్రస్తుతం ఇద్దరిని అరెస్టు చేశామని.. మరో ఇద్దరిని కూడా త్వరలోనే అరెస్టు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.